క్లుప్తంగా

పంట కాలువలో ఉపాధిహామీ పనులు



మండవల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గన్నవరంలో పంట కాలువ పనులను రూ.63 వేల ఉపాధి నిధులతో 45 మంది కూలీలు మంగళవారం చేపట్టారు. ఎంటీపీ ఎస్.నవీన్ మాట్లాడుతూ ఉపాధి పనుల ద్వారా కూలీలకు జీవనోపాధి కలుగుతుందన్నారు. పంట కాలువలు, పంట బోదెలు మరమ్మతులు చేయడం ద్వారా పంట పొలాలలకు సమృద్ధిగా సాగునీరు చేరుతుందని తెలిపారు. దీంతో రైతులు అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

200 మందికి అన్నదానం



హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయుడికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు క్లేపల్లి సత్యనారాయణ ప్రదీప్‌కుమార్ రాజు సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆలయంలో భక్తజన సందడి

పామర్రు: జిల్లాలోని ప్రముఖ దేవాలయాల్లో ఒకటైన స్థానిక ఉండ్రపూడి-పోలవరంఅడ్డ రోడ్డు వద్ద ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. జ్యేష్ఠమాసం మంగళవారం కావడంతో ఆలయం భక్తులతో నిండిపోయింది. తొలుత స్వామిని పంచామృతాలతో ఆవుపాలతో నవరసాలతో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో భక్తులు పాల పొంగళ్లను వండి, స్వామికి నివేదనలు ఇచ్చారు. కొత్తగా కొనుగోలు చేసిన వాహనాలకు యజమానులు పూజలు చేయించుకున్నారు. స్వామికి వడమాలలు, నిమ్మకాయ మాలలు, నాగవల్లిలతో విశేషంగా పూజలను అర్చకులు అగ్నిహోత్రం రామాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి గాంచిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి మంగళవారం అభిషేకాలు చేశారు. ఈ అభిషేకాలకు జిల్లాలోని నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. స్వామివారి పుట్టలో పాలు పోసి అభిషేకాలు చేశారు. పాల పొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారు చేసి స్వామికి సమర్పించారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో సుబ్బారాయుడికి 160కి పైగా అభిషేకాలు చేశారు. సహాయ కమిషనర్ నేల సంధ్య, సిబ్బంది పర్యవేక్షించారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

గుడివాడ టౌన్: గత ప్రభుత్వంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా ఐదేళ్లు సేవలందించిన తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కృష్ణాజిల్లా కోశాధికారి బి. సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం మద్యం దుకాణాలు మూసివేసి ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తారంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో తాము ఆందోళనకు గురవుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్యం దుకాణాల్లో సూపర్‌వైజర్లు, సేల్స్ మేనేజర్లుగా 12 వేల మంది పని చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం మద్యం అమ్మకాలు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వేలాదిమంది నిరుద్యోగ యువత రోడ్డునపడతారని పేర్కొన్నారు. నూతన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి తమపై సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఇరిగేషన్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

పామర్రు: ఇరిగేషన్ స్థలాలపై ఆక్రమణలకు పాల్పడితే సహించేది లేదని పామర్రు ఇరిగేషన్ శాఖ అధికారి ఎం.అనిల్‌కుమార్ పేర్కొన్నారు. పామర్రు-గుడివాడ జాతీయరహదారి పక్కన ఉన్న పంట కాలువల గట్ల స్థలాలపై ఆక్రమణలను మంగళవారం సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇరిగేషన్ స్థలాల ఆక్రమణ చట్టరీత్యా నేరముగా పరిగణించబడుతుందన్నారు. దీంతో పాటు పంటకాలువలలో నీటి పారుదలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. ఎక్కడైనా ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న పుల్లేరు వద్ద ఉన్నగొడ్ల రేవు గతంలో ఆక్రమణకు గురైతే తొలగించామన్నారు. పంచాయతీకి అప్పగించి గొడ్లరేవు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

హైవేపై పశువుల మృత్యువాత

- వాహనాలు ఢీకొట్టిన ఘటనలు అనేకం..
- కొన్నిసార్లు ప్రాణాలు కోల్పోతున్న వాహనచోదకులు
- వేసవి సీజన్‌లో ప్రమాదాల సంఖ్య ఎక్కువ



కృత్తివెన్నులో జాతీయ రహదారిపై పశువుల సంచారం

కృత్తివెన్ను: జాతీయ రహదారిపై ఏదో ఒక చోట వాహనాలు ఢీ కొని పశువులు మృత్యువాత పడుతున్న సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి. పెడన నియోజకవర్గ పరిధిలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలను కలుపుతూ 216 జాతీయ రహదారి సుమారు 40 కిలోమీటర్లు పైబడి విస్తరించి ఉంది. రహదారి వెంట రాత్రి వేళల్లో అధికంగా పశువులు సంచరించడంతో మృత్యువాత పడుతున్నాయి. వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణించడం అనుకోకుండా పశువులు రోడ్డుపైకి రావడంతో ఈ ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఇటీవల కాలంలో దాదాపు 120 నుంచి 140 వరకు వేలాది రూపాయలు విలువ చేసే గేదెలు ప్రమాదాల బారిన పడి మరణించాయి.



ప్రమాదంలో జాతీయ రహదారిపై పశు కళేబరం



పశువును ఢీ కొట్టడంతో ధ్వంసమైన కారు(ఫైల్)

ఢీ కొడితే పెను ప్రమాదమే....

హైవేపై పొరపాటున గేదె, ఆవును ఏదైనా కారు ఢీ కొడితే పెనుప్రమాదమే జరుగుతోంది. ఈ ఘటనల్లో పశువు చనిపోవడమే కాకుండా వాహనం పూర్తిగా ధ్వంసం కావడం ఒక్కొక్కసారి వాహనంలోని వ్యక్తులు సైతం మరణిస్తున్నారు. ఇటీవల కాలంలో మునిపెడ సమీపంలో హైవేపై ప్రమాదంలో చనిపోయిన పశువును గమనించకుండా కారు ఆ గేదెను ఢీ కొట్టి పక్కనే ఉన్న పంటపొలాల్లో పడిపోయింది. ఘటనలో కారు పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు కారులోని మహిళ ఘటనా స్థలంలోనే మరణించింది. మోటారు బైక్‌లు పశువులను ఢీ కొట్టి పలువురు వ్యక్తులు చనిపోగా పదుల సంఖ్యలో తీవ్రంగా గాయపడిన వారున్నారు.

రైతులకు భారీ నష్టం

వేసవి సీజన్‌లో నీటికోసం దారితప్పిన పశువులు రాత్రి సమయంలో ఇలా రహదారిపైకి రావడం చీకట్లో కనిపించకపోవడంతో వాహనాలు ఢీ కొని చనిపోవడం జరుగుతున్నాయి. వీటితో వేలాది రూపాయలు విలువైన పశువులు చనిపోవడంతో రైతులకు భారీ నష్టం కలుగుతుందని వారు వాపోతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



మన ప్రాంతానికి హైవే కొత్తగా రావడంతో ఈ ప్రాంత వాసులు ఇంకా రహదారికి నిబంధనలకు అలవాటు పడలేదు. రోడ్డుపై ఎలా మసలుకోవాలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం వేసవి కావడంతో సహజంగా పశువులు దారి తప్పుతాయి. రైతులు కూడా తమ పశువులను వదిలేయకుండా కాపలా కాయాల్సిన అవసరం ఉంది. పశువులు రోడ్డుపైకి రావడంతో పశువుల ప్రాణాలతో పాటు వాహనచోదకుల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడుతున్నాయి. దీనిపై పాడిరైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– కె. నాగరాజు, ఎస్ఐ కృత్తివెన్ను

స్వామివారి సన్నిధిలో ప్రముఖులు



మోపిదేవిలో స్వామివారి సన్నిధిలో విశ్రాంత ఐఏఎస్ అధికారి రఘురాం



స్వామివారిని దర్శించుకున్న వేదవ్యాస్

మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని రెవెన్యూ శాఖలో ముఖ్యకార్యదర్శిగా పని చేసిన విశ్రాంతి ఐఏఎస్ అధికారి రఘురాం, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ దంపతులు విడివిడిగా మంగళవారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసిన వారు నాగపుట్టలో పాలపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి అభిషేకం చేశారు. ఆయన వెంట అవనిగడ్డ నూతన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అల్లుడు శీలం అశ్వనీకుమార్, రావి రత్నగిరి, నాదెళ్ల శరత్‌చంద్రబాబు, కోసూరు రవి, సనకా ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

మత్స్యకారులకు సముచిత స్థానం కల్పించాలి

ఏపీ మత్స్యకార జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్



మాట్లాడుతున్న సైకం రాజశేఖర్

అవనిగడ్డ: రాష్ట్ర మంత్రి వర్గంలో మత్స్యకార ప్రజాప్రతినిధులకు సముచిత స్థానం కల్పించాలని ఏపీ మత్స్యకార జేఏసీ చైర్మన్ సైకం రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక 4వ వార్డులోని మత్స్యకార సామాజిక భవనంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం నుంచి అత్యధిక మెజారిటీతో ముగ్గురు మత్స్యకార ప్రజాప్రతినిధులు ఈ ఎన్నికల్లో విజయం సాధించారని, వీరిలో ఇద్దరిని మంత్రి వర్గంలోకి తీసుకోవాలని కూటమి పార్టీలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అన్ని సామాజిక వర్గాలకు పరిపాలనలో, బడ్జెట్ కేటాయింపులు అన్ని రంగాల్లో దామాషా ప్రాతిపదికన కేటాయింపులు జరగాలన్నారు. మచిలీపట్నం, కాకినాడ నుంచి టీడీపీ, నరసాపురం నుంచి జనసేన అభ్యర్థులు గెలుపొందిన నేపథ్యంలో ఇద్దరికి మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్నారు. సమావేశంలో అగ్నికుల క్షత్రియ రాష్ట్ర నాయకుడు ఒడుగు శ్రీకాంత్, మత్స్యకార జేఏసీ నాయకులు కోలా బాలాజీ, నాగిడి గోవింద్, సైకం శ్రీనివాసరావు, నాగిడి అమలేశ్వరరావు, చాపల రామకృష్ణ, నడకుదురు దావీదు, శంకరరావు, కొక్కిలిగడ్డ లక్ష్మణబాబు, కోలా వెంకటేశ్వరరావు, అండ్రాజు శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ నాంచారయ్య, కొప్పనాతి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోదండ రామాలయం వార్షిక ప్రతిష్ట మహోత్సవం



మూలవిరాట్‌లకు అభిషేకాలు

నగరంలోని నిజాంపేట బ్రాహ్మణ అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ కోదండరామాలయం ప్రథమ వార్షిక ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. మంగళవారం మూల మూర్తులకు, ఉత్సవమూర్తులకు అష్టోత్తర కలశ స్నపన (అభిషేకాలు) నిర్వహించారు. సాయంత్రం లక్ష మల్లిక కుసుమార్చన అత్యంత భక్తి శ్రద్ధలతోనిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ భక్తబృందం ప్రతినిధులు పర్యవేక్షించారు.

–మచిలీపట్నంటౌన్

ఆర్‌సీఎం చర్చి వందేళ్ల వేడుక



ప్రత్యేక ప్రార్థన చేస్తున్న ఫాదర్స్ బెర్నార్డ్, ప్రశాంత్

ఉల్లిపాలెం(కోడూరు): ఉల్లిపాలెం ఏసు తిరు హృదయ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి)లో మంగళవారం వందేళ్ల వేడుక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కోడూరు ఆర్‌సీఎం విచారణ గురువు చౌటపల్లి ప్రశాంత్ మాట్లాడుతూ ఉల్లిపాలెం ఆర్‌సీఎం చర్చి వందేళ్ల ప్రస్థానాన్ని వివరించారు. ప్రత్యేకమైన వేడుకలో విశ్వాసులందరూ భాగస్వామ్యం కావాలన్నారు. లక్ష్మీపురం ఆర్‌సీఎం విచారణ గురువు బెర్నార్డ్ మాట్లాడుతూ క్రీస్తు సందేశాన్ని వివరించారు. ఏసుక్రీస్తు మార్గంలో నడచుకోవడం ద్వారా శాంతియుత సమాజం నెలకొంటుందన్నారు. క్రీస్తు సుగుణాలైన శాంతి, ప్రేమ, దయతో నడచుకోవాలని విశ్వాసులకు సూచించారు. తొలుత మరియమాత స్వరూపానికి పూలమాలవేసి ప్రార్థనలు చేశారు. అనంతరం విశ్వాసులకు దివ్యసత్ప్రసాదాన్ని అందించారు. ఈ సందర్భంగా బంటుమిల్లి ఆర్‌సీఎం చర్చి ఫాదర్ మహేష్ ఆధ్వర్యంలో ఆలపించిన క్రైస్తవ గీతాలు ఆకట్టుకున్నాయి. పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉల్లిపాలెం సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు పర్యవేక్షించారు.

సబ్సిడీపై వరి విత్తనాల విక్రయాలు

విజయవాడరూరల్: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు రైతులకు కిలో ఐదు రూపాయల సబ్సిడీపై విక్రయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ఎంటీయూ-1318, ఎంటీయూ-1061 30కిలోల బస్తా రూ. 1,060 చొప్పున విక్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంటీయూ-1224, బీపీటీ 5204 రకాల వరి విత్తనాలు రావాల్సి ఉందన్నారు.

ముగ్గురు విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్



జాహ్నవి



బి.లక్ష్మణ్



ఎం.శ్యాంకుమార్

పెడన : పట్టణ పరిధిలోని బట్టా జ్ఞాన కోటయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికయ్యారని ఇన్‌చార్జి హెచ్‌ఎం కె. లక్ష్మీకోట్నీస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతున్న జాహ్నవి, బి.లక్ష్మణ్, ఎం శ్యాంకుమార్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరికి సంవత్సరానికి రూ. 12 వేల చొప్పున 6 సంవత్సరాలు స్కాలర్‌షిప్ సొమ్మును కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని ఆమె పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

చెరువులను కలుషితం చేస్తే కఠిన చర్యలు

- ఈఓపీఆర్డీ నరసమ్మ
- మర్రిపాలెం గ్రామస్తుల ఫిర్యాదుపై చెరువు పరిశీలన



మర్రిపాలెంలో మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ నరసమ్మ



మంచినీటి చెరువులో ఈదులాడుతున్న పశువులు

మర్రిపాలెం(నాగాయలంక): మండలంలో మంచి నీటి చెరువులను కలుషితం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మండల విస్తరణాధికారి కె.అప్పలనరసమ్మ మంగళవారం హెచ్చరించారు. నాగాయలంక సమీపంలోని మర్రిపాలెం గ్రామం మంచినీటి చెరువులో గ్రామస్తులు పశువుల(గేదెలు)ను దించడంతో నీరు కలుషితమవుతోందని ఆమెకు ఫిర్యాదు అందింది. తక్షణం స్పందించిన ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి చెరువును పరిశీలించారు. కార్యదర్శులు రమణ, నరేష్‌లను పిలిపించి చెరువులోకి పశువులను దించకుండా చెరువు చుట్టూ ఉన్న రైతులు, గ్రామస్తులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమెను కలసిన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని మంచినీటి చెరువుల్లో పశువులను దించి కలుషితం చేయకుండా దండోరా వేయించాలని పంచాయతీలకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. పంచాయతీల ఆధ్వర్యంలో మంచినీటి చెరువుల చుట్టూ ఫెన్సింగ్‌తో రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులతో పంచాయతీల కార్యదర్శులు సంప్రదించి చెరువుల రక్షణ చర్యలపై దృష్టి పెట్టాలని ఈఓపీఆర్డీ పేర్కొన్నారు.

ఈఏపీసెట్‌లో స్టార్ కాలేజ్ విద్యార్థుల ప్రతిభ



ఈఏపీసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మచిలీపట్నంటౌన్: నగరంలోని లక్ష్మీటాకీస్ సెంటరులోని స్టార్ కాలేజ్ విద్యార్థులు 2024 ఈఏపీసెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారు. కాలేజీకి చెందిన జె.లక్ష్మీతేజస్వి 708వ ర్యాంకు సాధించి టాపర్‌గా నిలిచింది. కాలేజీకి చెందిన పి.ఖనిజ 1241 ర్యాంకు, కె.శ్రీకర్ 2102, బీడీ శరవాణి 2303, ఎండీ ఇర్ఫాన్ 2307, ఎంకే సాయిహర్షిత 2325, వంశీ రఘురామ్ 2858, బి.తనిష్క వర్మ 4497, కె హేమంత్‌బాబు 5340, ఎవీఆర్ సిద్ధార్థ 5806, ఎస్ లక్ష్మీతమన్నా 5811 ర్యాంకులను సాధించారు. వీరితో పాటు 20వేల లోపు ర్యాంకులను 20 మంది విద్యార్థులు సాధించారని కాలేజీ డైరెక్టర్లు పి.శ్రీరామ్, బి. అయ్యప్పస్వామి తెలిపారు. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులు, అధ్యాపక బృందాన్ని శ్రీరామ్, అయ్యప్పస్వామి అభినందించారు.

పేదలకు కొండంత అండ

- ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- ఆరు నెలల్లో ఐదుగురు గర్భిణులకు వైద్యసేవలందించి డెలివరీ చేసిన డాక్టర్ వేమూరి ప్రమోద్‌కుమార్
- 24 గంటలూ అందుబాటులో వైద్యులు, సిబ్బంది
- పీహెచ్‌సీల్లో ఉచిత డెలివరీలు



ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఘంటసాల: సకల సౌకర్యాలు ఉండటంతో ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పేదలకు కొండంత అండగా కనిపిస్తోంది. ఇక్కడ నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యమిస్తుండటంతో పేదలకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడం లేదు. ప్రస్తుతం ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో సాధారణ డెలివరీకి రూ.25 వేల నుంచి రూ.40 వేలు వరకు ఖర్చవుతుండగా, ఆపరేషన్ చేయాల్సి వస్తే రూ.60 వేల పైనే ఖర్చవుతోంది. దీంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరి సమస్యలను గుర్తించిన గత ప్రభుత్వం నాడు-నేడుతో పీహెచ్‌సీలను అభివృద్ధి చేసింది. అంతేకాకుండా గర్భిణులు సుఖ ప్రసవం జరగడానికి కావాల్సిన సకల సౌకర్యాలు కల్పించారు.

ఘంటసాల పీహెచ్‌సీలో..

ఘంటసాల పీహెచ్‌సీలో డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో గతేడాది నవంబర్ నుంచి ఈ ఏడాది మే నెల వరకు ఐదుగురు గర్భిణులకు రూపాయి ఖర్చు లేకుండా సుఖ ప్రసవాలు చేశారు. అంతేకాక పీహెచ్‌సీల్లో డెలివరీ అయిన మహిళలకు ఆరోగ్య ఆసరా కింద రూ.4 వేలను ప్రభుత్వం అందించింది. ఆస్పత్రిలో ఉన్న రోజులకు భోజన ఖర్చులు అందిస్తుందని వైద్య ఆరోగ్య అధికారులు తెలియజేశారు.

ఘంటసాలపాలెం, శ్రీకాకుళం పీహెచ్‌సీల్లోనూ..

ఘంటసాల మండలంలోని ఘంటసాల పీహెచ్‌సీతో పాటు ఘంటసాలపాలెం, శ్రీకాకుళం పీహెచ్‌సీల్లో కూడా డాక్టర్లు యు.లిఖిత ప్రసాద్, పి.హనుమంతురావు ఆధ్వర్యంలో ఏడాదిలో 10 మంది గర్భిణులకు సుఖ ప్రసవాలు చేశారు.

పీహెచ్‌సీల్లో సేవలను వినియోగించుకోవాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేసిన తర్వాత గర్భిణులతో పాటు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నాం. పీహెచ్‌సీల్లో గర్భిణులకు ఉచిత ప్రసవాలు చేయడంతో పాటు అన్ని పరీక్షలు ఉచితంగా చేసి నాణ్యమైన వైద్య సేవలందిస్తున్నాం. 24 గంటలూ వైద్య సేవలు అందించడానికి అందరూ అందుబాటులో ఉంటున్నారు. పీహెచ్‌సీల్లో ఉచితంగా డెలివరీ అవడంతో పాటు ఆరోగ్య ఆసరా కింద ప్రభుత్వం రూ.4 వేలను సంబంధిం మహిళకు అందిస్తోంది.

– డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, ఘంటసాల పీహెచ్‌సీ

నాణ్యమైన వైద్య సేవలు



ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అంటే భయపడ్డాను. ఇక్కడి వైద్యులు, సిబ్బంది చాలా ధైర్యం చెప్పారు. స్నేహపూర్వకంగా ఉంటూ డెలివరీ చేశారు. గతంలో చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ కాగా, ఇప్పుడు ఘంటసాల పీహెచ్‌సీలో కాన్పు కావడం ఆనందంగా ఉంది. నాణ్యమైన వైద్య సేవలందించిన డాక్టర్ ప్రమోద్ కుమార్‌కు, సిబ్బందికి కృతజ్ఞతలు.

– దేవబోయిన పద్మ, గోటకం

ఉచితంగా చేశారు



వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాం. నా భార్య డెలివరీకి డబ్బులు ఎలా సమకూర్చుకోవాలా అంటూ ఆందోళన చెందుతుండగా ఘంటసాల పీహెచ్‌సీలో ఉచితంగా డెలివరీలు చేస్తున్నారని సిబ్బంది చెప్పారు. మా ఆవిడను చేర్పించాను. వైద్యులు తక్షణమే స్పందించి అన్ని పరీక్షలు చేసి ఉచితంగా సుఖ ప్రసవం చేశారు. నాకు రూ.25 వేల నుంచి 40 వేలు కలిసొచ్చాయి. మంచి వైద్య సేవలందిస్తున్న వైద్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు.

– దేవబోయిన వేణు, గోటకం

14న ఆలయ భూముల వేలం

ముదినేపల్లి రూరల్: రెండో పూరీగా ప్రసిద్ధి చెందిన వడాలి జగన్నాథస్వామి ఆలయ భూములకు ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయానికి గుడివాడ రూరల్ మండలం శేరిగొల్వేపల్లిలో 2.25 ఎకరాల విస్తీర్ణంలో చేపల చెరువు ఉందని పేర్కొన్నారు. ఈ చెరువును మూడేళ్ల లీజుకు ఇచ్చేందుకు శేరిగొల్వేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద 14న వేలం నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా ఆలయానికి వడాలిలో వివిధ సర్వే నంబర్లలో ఉన్న పల్లపు భూములకు సంబంధించి ఆలయం వద్ద ఆ రోజు మధ్యాహ్నం వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వడాలిలోని విశ్వేశ్వరస్వామి ఆలయానికి గ్రామంలో ఉన్న పల్లపు భూమికి 14న జగన్నాథస్వామి ఆలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు. అదేవిధంగా మండలంలోని అల్లూరు సోమేశ్వరస్వామి ఆలయానికి అల్లూరు, బొమ్మినంపాడులో ఉన్న చేపల చెరువులను మూడేళ్ల లీజుకు ఇచ్చేందుకు 14న ఆలయం వద్ద వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.